సాక్షి
అనంతపురం
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



**చీనీ టన్ను రూ.16,500**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500 పలికాయి.



**టమాట కిలో రూ.16**

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/21.9°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### రేపు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



**అనంతపురం అర్బన్:** 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈనెల 7న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

### బాలల చట్టాలపై అవగాహన అనివార్యం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమా రావు

**అనంతపురం:** బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమా రావు అన్నారు. శనివారం పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్. చినబాబు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు, పోలీసులతో జిల్లా కోర్టులో సమావేశం నిర్వహించారు. బాలల రక్షణ చట్టాల్లోని కీలక అంశాలను చర్చించారు. ఏపీ హైకోర్టులో సెప్టెంబర్ 14న రాష్ట్రస్థాయి జువైనల్ జస్టిస్ కమిటీ సదస్సు జరగనుందని, జిల్లాకు సంబంధించిన వివరాలు సమగ్రంగా అందజేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

**కోర్టుల తనిఖీ..**

**గుత్తి:** పట్టణంలోని కోర్టులను జిల్లా జడ్జి భీమా రావు శనివారం తనిఖీ చేశారు. పోలీసులు ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన ఏడీజే, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంటు)గా పలువురిని నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. కర్నూలు జిల్లాకు చెందిన మొలగవల్లి మహేంద్రనాథ్‌రెడ్డికి కళ్యాణదుర్గం అసెంబ్లీ, అనంతపురం జిల్లాకు చెందిన కే.రమేష్‌రెడ్డికి ధర్మవరం, శింగనమల అసెంబ్లీ స్థానాలు, నార్పల సత్యనారాయణ రెడ్డికి రాప్తాడు, ఉరవకొండ అసెంబ్లీ స్థానాలు, ఎల్ఎం మోహన్ రెడ్డికి రాయదుర్గం, తాడిపత్రి అసెంబ్లీ స్థానాలు, బోయ తిప్పేస్వామికి గుంతకల్లు, అనంతపురం అర్బన్ అసెంబ్లీ స్థానాలు కేటాయించింది. వీరు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నారు.

అధికార అండతో రెచ్చిపోతున్నారు. అరాచకాలు సృష్టిస్తున్నారు. దౌర్జన్యాలకు దిగుతున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'పచ్చ' నేతల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. ప్రతిపక్ష నాయకులపై దాడులకు దిగడమే కాకుండా బాధితులపైనే అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్న 'తమ్ముళ్లు'.. పేదలకు ఉపాధి కల్పించే పరిశ్రమలపైనా పడుతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల 'కియా'లోకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించడం కలకలం సృష్టించింది.





ఇటీవల కియా సమీపంలో సంఘు హైటెక్ పరిశ్రమలోకి దౌర్జన్యంగా దూసుకుని వెళ్లిన టీడీపీ నాయకులు(ఫైల్)

# అరాచకాలతో ఆందోళన

**'కియా'కు కూటమి కష్టాలు**

- నాలుగు నెలల్లోనే రెండుసార్లు టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం
- అన్ని కాంట్రాక్టులూ తమకే కావాలని యాజమాన్యంపై ఒత్తిడి
- ఇప్పటికే 900 కార్ల ఇంజిన్ల చోరీతో యాజమాన్యంలో భయం
- కియాలో ఉన్నతోద్యోగాలన్నీ ఇతర రాష్ట్రాల వారికేనన్న విమర్శలు
- నైపుణ్యం లేదన్న సాకుతో స్థానికులకు చిన్న ఉద్యోగాలు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ప్రముఖ 'కియా' కార్ల కంపెనీ కూటమి నేతలతో కష్టాలు ఎదుర్కొంటోంది. తామే రాష్ట్రానికి 'కియా' తెచ్చామని జబ్బలు చరచుకునే సీఎం చంద్రబాబు... ఆయన పార్టీకి చెందిన వారే కంపెనీపై దౌర్జన్యాలకు దిగుతుంటే కిమ్మనడం లేదు. స్థానిక టీడీపీ నేతల ఒత్తిళ్లు, దౌర్జన్యాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కంపెనీ నిర్వాహకులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

**ఉత్పత్తికి ఆటంకం..**

పెనుకొండ నియోజకవర్గం అమ్మవారిపల్లె వద్ద ఉన్న కియా ప్లాంటుపై రెండు దఫాలు టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. కియాలో ఉన్న కాంట్రాక్టులన్నీ తమకే కావాలని, ఎవరికీ ఇవ్వకూడదని కంపెనీలోకి చొరబడ్డారు. కియాకు విడి భాగాలు సరఫరా చేసే చిన్న పరిశ్రమల వాహనాలు ఆపేశారు. పోలీసులు వచ్చి టీడీపీ కార్యకర్తలను వెనక్కి పంపారు. ఇటీవల మళ్లీ టీడీపీ వర్గీయులు ఆందోళనకు దిగడం గమనార్హం. వీళ్లందరూ మంత్రి సవిత అనుచరులని తెలుస్తోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కియా నిర్వాహకుల్లో ఆందోళన మొదలైంది. కార్ల ఉత్పత్తికి ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు.

**స్థానికులకు ఉద్యోగాలు ఎక్కడ?**

కియా యాజమాన్యం స్థానికంగా భూములు ఇచ్చి, తోడ్పాటునందించిన వారికి ఉద్యోగాలు ఇవ్వలేదన్న విమర్శలు ఎదుర్కొంటోంది. ఇక్కడ రమారమి 3 వేల మందికి పైగా పనిచేస్తుంటే స్థానికులు 5 శాతం కూడా లేరు. ఉన్నవారు కూడా రూ.20 వేల కంటే తక్కువ జీతం పొందుతున్న వారేనని తెలుస్తోంది. కొరియన్ దేశస్తుల తర్వాత తమిళనాడు వాళ్లు ఎక్కువగా ఇక్కడ ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని, స్థానికులకు నైపుణ్యం లేదన్న సాకుతో ఉద్యోగాలు లేవంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రోడ్డుపై తమ్ముళ్ల బీభత్సం (ఫైల్)

**ఆదాయం అంతంతే..**

అనంతపురం లేదా శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న సిమెంటు లేదా ఇతర పరిశ్రమలతో పోల్చితే కియా నుంచి తగిన ఆదాయం కూడా లేదని జీఎస్టీ అధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రానికి కాని, ఉమ్మడి అనంతపురం జిల్లాకు గానీ ఎస్‌జీఎస్‌టీ ద్వారా నామమాత్రంగా కూడా ఆదాయం లేదని, మన రాష్ట్రంలో కార్లు అమ్ముడుపోతేనే ఇక్కడ ఆదాయం ఉంటుందని అంటున్నారు. అయితే, మన రాష్ట్రంలో కియా కార్ల అమ్మకాలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాలకు వెళ్లడంతో రాష్ట్రానికి కియా నుంచి సరైన ఆదాయం రావడం లేదని అభిప్రాయపడుతున్నారు.

**900కు పైగా ఇంజిన్లు మాయం...**

కొన్ని నెలల క్రితం 'కియా'లో భారీ దొంగతనం జరిగింది. రమారమి 900 కార్ల ఇంజిన్లు మాయమయ్యాయి. ఈ వ్యవహారంలో పోలీసులు కొంతమందిని పట్టుకోగలిగినా రికవరీ 20 శాతం కూడా జరగలేదని తెలిసింది. ఈ ఘటనతో కియాలో ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి. ఈ క్రమంలో కంపెనీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొనగా.. రోజుకో ఘటనతో యాజమాన్యం బెంబేలెత్తుతోంది.

### బ్యాంకు దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

- రెండు కిలోల బంగారు ఆభరణాలు, కారు, బైకు స్వాధీనం

**పుట్టపర్తి టౌన్:** హిందూపురం రూరల్ తూముకుంట చెక్‌పోస్టు సమీపంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచులో దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడు అనిల్ కుమార్ పన్వార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు కిలోల బంగారు ఆభరణాలు, కారు, బైకు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ రత్న శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది జూలై 26న తూముకుంట ఎస్‌బీఐలో దొంగతనం జరిగింది. విలువైన ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఆదేశాల మేరకు అనంతపురం, చిత్తూరు, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన పోలీసులతో ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. ఐదు రాష్ట్రాలలో గాలింపు చేపట్టారు. ఈ కేసులో నిందితుడైన హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్‌ను గుర్గాన్ జిల్లాలో అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు కేజీల బంగారు ఆభరణాలు, కారు, బైకు స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసైన పన్వార్.. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశంతో దేశంలో అనేక చోట్ల బ్యాంకు దోపిడీలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో జైలుకు వెళ్లడం, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నాడు. గతంలో అనంతపురంలో జరిగిన బ్యాంకు దోపిడీ కేసులోనూ ముద్దాయిగా ఉన్నాడు. ఇతనిపై వివిధ రాష్ట్రాల్లో 18 కేసులు ఉన్నాయి. ఐదేళ్లు జైలుకు కూడా వెళ్లాడు. కాగా..తూముకుంట బ్యాంకు దోపిడీ కేసులో రాజస్థాన్‌కు చెందిన ఇంకొక ముఠా సభ్యుడు పరారీలో ఉన్నాడని, అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

## 'కూటమి' మెడలు వంచైనా న్యాయం

- చంద్రబాబుకు కనువిప్పు కలిగించేందుకే 'అన్నదాత పోరు'
- రైతన్నలకు మద్దతుగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



'అన్నదాత పోరు' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ నేతలు

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వ మెడలు వంచైనా రైతులకు న్యాయం చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుకు కనువిప్పు కలిగించేందుకే ఈ నెల 9న 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులను ప్రకృతి కూడా కరుణించలేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వ సహకారమూ కరువై రైతులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నదాతల సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించినా ఎటువంటి మార్పులేదన్నారు. ఈ క్రమంలోనే తమ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు 'అన్నదాత పోరు' తలపెట్టినట్లు వెల్లడించారు. తన రెక్కల కష్టంతో సమాజానికి అన్నం పెట్టే రైతన్నలకు మద్దతుగా ప్రతి ఒక్కరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న ఉరవకొండ, కళ్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్లలో ర్యాలీలు నిర్వహించి ఆర్డీఓలకు వినతి పత్రం అందిస్తామన్నారు. అనంతపురంలో జెడ్పీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. రైతులు, రైతు సంఘాలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గత ఖరీఫ్, రబీలో వర్షాభావ పరిస్థితులతో పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. పెట్టుబడి కూడా తిరిగి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో విత్తనాల నుంచి ఎరువుల వరకూ ఏ ఒక్కటీ సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. బ్లాక్ మార్కెట్‌కు యూరియాను తరలించారన్నారు. రూ.260 అమ్మాల్సిన యూరియా బస్తాను రూ.350 నుంచి రూ.400కు విక్రయిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. జిల్లాలో 8.50 లక్షల ఎకరాల సాగుభూమి ఉంటే 4.30 లక్షల్లోనే పంటలు సాగు చేశారన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఏమాత్రమూ పట్టించుకోలేదన్నారు. హెచ్ఎల్‌సీ ద్వారా సౌత్,నార్త్ కెనాల్‌కు నీరందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైపుల్లాబేగ్, చంద్రశేఖర్ యాదవ్, ఓబిరెడ్డి, సాకే చంద్రశేఖర్, అమర్‌నాథ్ రెడ్డి, శ్రీనివాసులు నాయక్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, పార్టీ రాష్ట్ర నేతలు వెన్నంశివరామిరెడ్డి, చుక్కలూరు దిలీప్ రెడ్డి, మారుతీనాయుడు, జానీ, కృష్ణవేణి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సంపంగి రామాంజినేయులు, నాయకులు రాధాయాదవ్, అనిల్‌కుమార్ గౌడ్, సాకే కుళ్లాయస్వామి, చింతకుంట మధు, థామస్, జావెద్, ఉదయ్, రాధా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా ఎక్కడ ఉంటే అక్కడికే!

- పరుగులు పెడుతున్న రైతులు

**శింగనమల:** మండలంలో యూరియా కోసం రైతులు ఇక్కట్లు పడుతున్నారు. మండలంలో ఎక్కడ పంపిణీ చేస్తున్నారని తెలిసినా వెంటనే అక్కడికి పరిగెత్తుతున్నారు. శనివారం శింగనమలలోని సింగిల్ విండో కార్యాలయానికి 10 టన్నుల యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే, వచ్చిన యూరియా మధ్యాహ్నం లోపు ఖాళీ కావడం గమనార్హం. దీంతో చాలా మంది నిరాశతో వెనుదిరిగారు. మండలంలో కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, ఉల్లికల్లు, కొరివిపల్లి, చీలేపల్లి, జూలకాల్వ, పి.జలాలపురం, పెరవలి, పోతురాజుకాల్వ, చక్రాయిపేట, సీ.బండమీదపల్లి, శివపురం, శింగనమల, గోవిందరాయునిపేట, సోదనపల్లి, గురుగుంట్ల, మదిరేపల్లి, లోలూరు గ్రామాల్లో వ్యవసాయ బోరు బావుల కింద వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటకు యూరియా అవసరం ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏఓ అన్వేష్‌కుమార్ మాట్లాడుతూ కల్లుమడి, తరిమెల సింగిల్ విండో కార్యాలయాలకు యూరియా సరఫరా చేశామని, మంగళవారం లోపు శింగనమల,రాచేపల్లి,కొరివిపల్లి, ఉల్లికల్లుకి సరఫరా చేస్తామని చెప్పారు.



శింగనమలలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం రైతుల రద్దీ

## యూరియా పక్కదారి పట్టకూడదు

- కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** 'యూరియా పక్కదారి పట్టకూడదు. దుర్వినియోగం కాకూడదు. రైతుకు అవసరమైన మోతాదు మేరకు పంపిణీ చేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారులు, తహసీల్దార్లు రోజూ ఒక ఎరువుల దుకాణానికి వెళ్లి తనిఖీ చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌లకు, ప్రైవేటు దుకాణాలకు వీఆర్ఓ లేదా వీఆర్ఏని ఏర్పాటు చేయాలన్నారు. రైతులు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా యూరియా వాడేలా చూడాలన్నారు. పంటలకు ఎంత మోతాదులో యూరియా ఉపయోగించాలనే వివరాలు తెలిసేలా పోస్టర్లు తయారు చేసి రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల వద్ద ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీయొద్దు



అనంతపురం నగరపాలక సంస్థ ఆవరణంలో సచివాలయ ఉద్యోగుల నిరసన

**గుంతకల్లు టౌన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్న సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం తగదని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మంజునాథ్, సుదర్శన్, పుష్పమి అన్నారు. వార్డు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా అధికార వర్గాలు ప్రవర్తిస్తున్న తీరుకు వ్యతిరేకంగా శనివారం జేఏసీ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సచివాలయ కార్యదర్శులను వలంటీర్లుగా మార్చడం తగదన్నారు. గతంలో వలంటీర్లకు ఒక క్లస్టర్‌ను పరిమితం చేస్తే ఇప్పుడు ఒక్కో కార్యదర్శికి మూడు క్లస్టర్‌లకు మ్యాప్ చేసి బలవంతంగా ఉద్యోగం చేయించడం సరికాదన్నారు. సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురంలో నిరసనాగ్రహం..**

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వం క్లస్టర్ విధులను కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అనంతపురంలో సచివాలయ ఉద్యోగులు నిరసనాగ్రహాన్ని ప్రదర్శించారు. శనివారం నగరపాలక సంస్థలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ అరియర్స్, పదోన్నతులు, రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్, కల్పించడంలో ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తూ ఉద్యోగులకు అన్యాయం చేస్తోందన్నారు. తమను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని, ఆందోళన కార్యక్రమాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మి నారాయణ, డీ సుధాకర్, రామకృష్ణ, చీరాల చంద్ర, శివశంకరయ్య, వరప్రసాద్, మౌలాలమ్మ, తేజశ్రీ, విమల పాల్గొన్నారు.

# అన్నదాతలతో చెలగాటం

కూటమి ప్రభుత్వం అన్నదాతలతో చెలగాటమాడుతోంది. బోరుబావుల కింద సాగు చేసుకుంటున్న పంటల అవసరానికి తగ్గట్లు యూరియా అందించకపోవడంతో ఇప్పటికే రైతులు అల్లాడిపోతున్నారు. మరోవైపు రిజర్వాయర్లలో నీరున్నా ఆయకట్టు భూములకు వదలకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండడంతో రైతన్నలకు దిక్కుతోచడం లేదు.

- ఐఏబీ సమావేశం నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం
- ప్రజాప్రతినిధులకు తీరిక లేక కుదరని ముహూర్తం



అనంతపురం వద్ద బోసిపోతున్న తుంగభద్ర ఎగువ కాలువ

**అనంతపురం సెంట్రల్:** వర్షాలకు తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. నెలన్నర రోజులుగా గేట్ల ద్వారా దిగువకు నీరెళ్లిపోతోంది. ఈ సమయంలో జిల్లాలో ఆయకట్టుకు ఎలాంటి ఢోకా ఉండదని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వంలో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన సాగునీటి సలహామండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించకపోవడంతో ఆయకట్టు భూములు ఇప్పటికీ బీడుగా దర్శనమిస్తున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులకు తీరిక లేకపోవడంతో సమావేశానికి ముహూర్తం కుదరడం లేదని తెలిసింది.

**గత ప్రభుత్వంలో జూలైలోనే..**

ఆగస్టులోపే ఐఏబీ సమావేశం నిర్వహించడం ఆనవాయితీ. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా జూలైలోనే సమావేశం నిర్వహించేవారు. ఉపకాలువలకు ఎప్పటి నుంచి నీటిని విడుదల చేస్తారు.. ఎన్ని రోజులు వదులుతారు.. తదితర వివరాలు అధికారికంగా ప్రకటించేవారు. దీనికి తగ్గట్టుగా రైతులు పంటలు సాగు చేసుకునేవారు. కానీ, కూటమి ప్రభుత్వంలో పరిస్థితి పూర్తి భిన్నంగా మారడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి.

**నెలరోజులుగా తిరుగుతున్నా...**

ఐఏబీ సమావేశం నిర్వహణ తేదీ ఖరారు కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారులు కాళ్లరిగేలా తిరుగుతున్నా స్పందన లేదు. బిజీగా ఉన్నామంటూ తిప్పి పంపిస్తున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అపాయింట్‌మెంట్ అసలు దొరకడమే లేదని తెలిసింది. ఆయకట్టుకు నీరందిస్తే త్వరితగతిన పంటలు సాగు చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీలోకి ప్రవేశిస్తున్నా నీరివ్వకపోవడంతో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఐఏబీ వెంటనే నిర్వహించాలి**



ఐఏబీ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి. ఆగస్టులోనే సమావేశం నిర్వహించాల్సి ఉంది. గత నెల 25న జరిగిన జిల్లా రివ్యూ కమిటీ సమావేశంలో నేను ప్రత్యేకంగా ఈ విషయాన్ని ప్రస్తావించా. ఆయకట్టుకు నీరు ఎప్పుడు వదులుతారు.. ఎంత కాలం నీటి లభ్యత ఉంటుందనే విషయాలపై స్పష్టత లేక రైతులు పంటలు సాగు చేసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి ఐఏబీ సమావేశం ఏర్పాటు చేయాలి.

– వై.శివరామిరెడ్డి,ఎమ్మెల్సీ

**త్వరలో తేదీ ఖరారు**

ఈ ఏడాది తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు నిండడంతో జిల్లాకు త్వరగా నీరు వస్తోంది. హెచ్చెల్సీతో పాటు హంద్రీ-నీవా ద్వారా వస్తున్న నీటిని పీఏబీఆర్, ఎంపీఆర్‌లలో నిల్వ చేస్తున్నాం. త్వరలో కలెక్టర్, ప్రజాప్రతినిధుల అనుమతి తీసుకొని సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తాం.

–సుధాకర్‌రావు, ఎస్ఈ, హెచ్చెల్సీ

## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ నాయకులకు 41ఏ నోటీసుల జారీ



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

**చెన్నేకొత్తపల్లి:** రాప్తాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, వెంకటేష్‌కు చెన్నేకొత్తపల్లి పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. వీరు గత నెలలో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీకి చెందిన ఫణీంద్ర ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురినీ ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ చేసి.. 41ఏ నోటీసులు అందజేశారు.

### 13న బీఎస్‌ఎన్‌ఎల్ లోక్ అదాలత్

**అనంతపురం సిటీ:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ కోర్టుల్లో నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో బీఎస్‌ఎన్‌ఎల్ ల్యాండ్‌ఫోన్/ఎఫ్‌టీటీహెచ్ ఫోన్ల వినియోగదారులు తమ బకాయిలను రాయితీపై చెల్లించే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్లోజ్ చేసిన ఫోన్లకు సంబంధించిన వినియోగదారులకు న్యాయ సేవాధికార సంస్థల ద్వారా నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అటువంటి వారు లోక్ అదాలత్‌కు ముందే బకాయిలు చెల్లిస్తే లోక్ అదాలత్‌కు హాజరు కావాల్సిన అవసరం ఉండదన్నారు.



# ధరలు ఢమాల్



ధరల మాయాజాలం అరటి రైతులను దెబ్బ తీస్తోంది. 20 రోజుల క్రితం టన్ను రూ.22 వేలు పలికిన అరటి.. నేడు ఒక్కసారిగా రూ.5వేల నుంచి రూ.7వేలకు మించడం లేదు. ఊహించని ఈ పరిణామంతో రైతు కుదేలవుతున్నాడు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది.

**అరటి రైతు దివాళా!**
- 20 రోజుల క్రితం టన్ను రూ.22 వేలు
- నేడు రూ.5 వేల నుంచి రూ.7వేలే
- కొనేవారు లేక చెట్లపైనే అరటి గెలలు
- ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

**తాడిపత్రి రూరల్:** తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో పలువురు రైతులు అరటి సాగు చేస్తున్నారు. తాడిపత్రి మండలంలో 136 ఎకరాలు, యల్లనూరు 3,572, పెద్దపప్పూరు 2,860, పుట్లూరు 5,450 ఎకరాలు, ఇంకా అక్కడక్కడా కలిపి మొత్తం 12,018 ఎకరాల్లో సాగులో ఉంది. అరటిలో సాధారణంగా మూడు దఫాలు పంట తీసుకుంటారు. మొదటి పంటకు ఎక్కువ ధర, రెండవ పంటకు తక్కువ, మూడవ పంటకు అతి తక్కువ ధర పలుకుతుంది. ఎకరాకు మొదటి పంటకు రూ.2.25 లక్షలు, రెండవ పంట రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షలు, మూడవ పంట రూ.50 వేలు పెట్టుబడి పెడతారు.

**మందగించిన అమ్మకాలు**

తాడిపత్రి నుంచి బెంగళూరు, మహారాష్ట్రలోని పూణే, నాగపూర్, ఢిల్లీ, రెండు తెలుగు రాష్ట్రాలు, కేరళలోని కొన్నిచోట్లకు అరటి రవాణా చేస్తున్నారు. మూడు వారాల కిందటి వరకు రోజూ వంద లారీల వెళ్లే అరటి లోడ్‌లు ఇప్పుడు పదిలోపే మార్కెట్లకు వెళ్తోంది. ఆయా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వినాయక చవితి ఉత్సవాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి అధికంగా అరటి వస్తుండటంతో ధర అమాంతం తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే వ్యాపారుల మాటలపై రైతులకు నమ్మకం కుదరడం లేదు.

**చెట్లపైనే 2 లక్షల టన్నుల అరటి**

ధరతో పాటు డిమాండ్ లేకపోవడంతో చెట్లపైనే దాదాపు 2 లక్షల టన్నుల అరటి ఉండిపోయింది. ప్రస్తుతం అరటికి సీజన్ కావడంతో ప్రతి తోటా గెలలతో నిండి ఉంది. రైతుల అంచనా ప్రకారం దిగుబడి ఎకరాకు మొదటి పంటకు 20 నుంచి 22 టన్నులు, రెండవ పంట 16 నుంచి 17 టన్నులు, మూడవ పంట 10 నుంచి 12 టన్నుల వరకు వస్తుంది. అన్ని పంటలూ కలుపుకొని దిగుబడి ఎకరాకు సగటున 17 టన్నులు వేసుకున్నా ప్రస్తుతం చెట్లపై 2 లక్షల టన్నుల అరటి కోతకు సిద్ధంగా ఉంది. ఎక్కువ రోజులు చెట్లపై గెలలు ఉంటే కాయలు నాణ్యత కోల్పోయే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు.

**ఉపాధికి విఘాతం**

అరటి సాగుతో పలువురు కూలీలకు పని దొరికేది. ఎక్కువమంది మహిళా కూలీలు ఈ ఉపాధితో సంసారాన్ని నెట్టుకొస్తున్నారు. మూడున్నర టన్నుల ఐషర్ వాహనానికి గెలల నుంచి అరటి కాయలను వేరుచేసి లోడ్ చేస్తే రూ.3 వేలు కూలి ఇచ్చేవారు. కూలీల సంఖ్యను బట్టి లోడ్‌కు ఒక్కొక్కరికి రూ.450 గిట్టుబాటు అయ్యేది. ఇతర నగరాలకు అరటిని రవాణా చేసేందుకు ఎక్కువగా ఐషర్ వాహనాలను ఉపయోగిస్తున్నారు. దీని ద్వారా ఐషర్ వాహనాల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు తదితరులకు ఉపాధి దొరికేది. ప్రస్తుతం అరటికి డిమాండ్ లేకపోవడంతో కాయలు కోసేందుకు వీలులేకుండా పోతోంది. దీనిపై ఆధారపడ్డ మహిళా కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

**ధరలేక ఇబ్బందులు**



14 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.2.25 లక్షలు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం ధర లేక ఇబ్బందులు పడుతున్నాం. పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి. ఎరువులు, మందుల రేట్లు పెరిగాయి. ప్రస్తుత ధర వల్ల పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి ఉంది.

– రామాంజులరెడ్డి, రైతు, రంగరాజుకుంట

**వ్యాపారులు రావట్లేదు**



ప్రస్తుతం అరటి టన్ను రూ.7వేల లోపు ఉంది. 20 రోజుల క్రితం టన్ను రూ.22 వేలు ధర పలికింది. నిలకడలేని ధర వల్ల రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 8ఎకరాల్లోని అరటిపంట గెలలతో ఉంది. పంటను కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు.

– జయరామిరెడ్డి, రైతు, చింతకుంట

### ‘అనంత’ వాసులకు పురస్కారాలు



పురస్కారాలతో ఎలూరి యంగన్న తదితరులు

**అనంతపురం కల్చరల్:** అనంతపురానికి చెందిన పలువురు జాతీయస్థాయి పురస్కారాలను అందుకున్నారు. ఐదు దశాబ్దాలుగా కళాకారుల సేవలను గుర్తిస్తూ వారికి గౌరవ సత్కారాలనందిస్తున్న బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ వారు 53వ వార్షికోత్సవ వేడుకలు శనివారం బళ్లారిలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా జిల్లావాసులు జనప్రియకవి ఏలూరు యంగన్న, పద్యకవి ఒంటెద్దు రామలింగారెడ్డిలకు జోళదరాశి చంద్రశేఖరరెడ్డి పురస్కారం, రఘునాథ్‌కు విశ్వావసు ఉగాది పురస్కారం, ‘అనంత’ రంగస్థలానికి చిరస్మరణీయ సేవలందిస్తున్న రామగోవిందసాగర్, సాధుశేఖర్‌కు బళ్లారి రాఘవ స్మారక అవార్డులను నిర్వాహకులు డాక్టర్ బ్రహ్మయ్య, యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి తదితరులు అందించి సత్కరించారు. జాతీయ అవార్డులను అందుకున్న అనంత కళాకారులకు లలితకళాపరిషత్తు కార్యదర్శి గాజుల పద్మజ, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.



అవార్డులతో సాధుశేఖర్ తదితరులు

### 9న జిల్లాస్థాయి డ్యాన్స్, స్పోర్ట్స్ పోటీలు

**అనంతపురం:** డ్యాన్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 9న నగరంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. భరతనాట్యం, కూచిపూడి, జానపదం, వెస్టర్న్, సెమీ క్లాసికల్ పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, అసోసియేషన్ గుర్తింపు కార్డు, డ్యాన్స్ ప్రాపర్టీస్, పాటల వివరాలతో ఈ నెల 8లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా అసోసియేషన్ సెక్రెటరీ ధనుంజయ తెలిపారు.

## ఇమామ్‌లు, మౌజన్‌లకు బాబు మొండిచేయి

- గౌరవ వేతనం ఇవ్వనందుకు 8న నిరసన



మాట్లాడుతున్న మైనార్టీ విభాగం నాయకులు

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వం గత 11 నెలలుగా ఇమామ్ (రూ.10వేలు ఒక్కొక్కరికి), మౌజన్‌లకు(రూ.5వేలు) గౌరవ వేతనం ఇవ్వకుండా మొండి చేయి చూపుతోందని వైఎస్సార్‌సీపీ అనుబంధ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ ధ్వజమెత్తారు. ఈ నెల ఎనిమిదిన కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామని తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి మేనిఫెస్టోలో ఇమామ్, మౌజన్‌లకు గౌరవవేతనం ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. సీఎం చంద్రబాబు ముస్లిం మైనార్టీల పట్ల కపటప్రేమ ప్రదర్శిస్తున్నారన్నారు. మైనార్టీల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కుటుంబం చొరవ తీసుకుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి మైనార్టీలను ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 10న జిల్లాలో కూటమి ప్రభుత్వం ‘సూపర్ సిక్స్- సూపర్ హిట్’ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండటం సిగ్గుచేటన్నారు. ఏం ఉద్ధరించారని ఏర్పాటు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫయాజ్, నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, కమర్‌తాజ్, మన్సూర్‌బాషా, రహంతుల్లా, ఖాజా, ఖాజీపీరా, దాదాఖలందర్, ఆసిఫ్, మహబూబ్‌బాషా, జావేద్, ఖాదర్ పాల్గొన్నారు.

## కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- పీఎంఎఫ్‌ఎంఈ కింద 35 శాతం రాయితీ
- ఎఫ్‌పీఎస్ ఈఓలు ఉమాదేవి, చంద్రశేఖర్



సోమలదొడ్డిలో సోలార్ డ్రయ్యర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీడీహెచ్, ఎఫ్‌పీఎస్ ఈఓ ఉమాదేవి

**అనంతపురం అగ్రికల్చర్:** ఆహారశుద్ధికి సంబంధించి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు రాయితీలతో ప్రోత్సహిస్తున్నట్లు రెండు జిల్లాల ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఎఫ్‌పీఎస్) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (ఈఓలు) డి.ఉమాదేవి, జి.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎం ఎఫ్‌ఎంఈ) కింద ఆసక్తి కలిగిన వ్యాపారవేత్తలు, యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, ఎఫ్‌పీఓలు, రైతు సహకార సంఘాలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మహిళా పొదుపు సంఘాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. చిన్నపాటి కుటీర పరిశ్రమల ఏర్పాటు వల్ల స్వయం సమృద్ధి సాధించడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించాలనేదే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాజెక్టు విలువలో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే... 35 శాతం ప్రభుత్వం రాయితీ రూపంలో ఇస్తుందన్నారు. మిగతా 55 శాతం బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఇందులో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. జిల్లాలో వేరుశనగ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్లు అంటే వేరుశనగ నూనె, చిక్కీల తయారీ లాంటికి ప్రాధాన్యత ఇస్తూనే... సోలార్ డీహైడ్రేషన్, పొటాటో చిప్స్, చెక్కిలాలు, ఊరగాయలు, రోటీ మేకర్, మసాలా పొడులు, అల్లం వెల్లుల్లి పేస్ట్, రెడీ టు ఈట్ ప్రొడక్ట్స్, శనగపప్పు, బేకరీ ఉత్పత్తులు, జెల్లీ, సాస్, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులు, బొరుగులు, రైస్ బేస్డ్ ప్రొడక్ట్స్, చింతపండు తదితర మరో 20 నుంచి 30 రకాల ఉత్పత్తుల తయారీకి రాయితీలతో ప్రోత్సహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు అనంతపురం జిల్లా ఈఓ డి.ఉమాదేవి (79950 86792), రీసోర్స్ పర్సన్ బి.హరీష్ (96767 96974), అలాగే శ్రీసత్యసాయి జిల్లా ఈఓ చంద్రశేఖర్ (79950 86791), రీసోర్స్ పర్సన్ (78933 47474)ను సంప్రదించాలని సూచించారు.



### 9న ఎకాలజీలో ‘ఫార్మా’ అడ్మిషన్ మేళా

**అనంతపురం అగ్రికల్చర్:** ఫార్మా రంగంలో శిక్షణ, ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 9న అనంతపురం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో అడ్మిషన్, ఉద్యోగ మేళా ఏర్పాటు చేసినట్లు ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన యువతీ యువకులకు స్వర్ణభారత్ ట్రస్ట్, విజయవాడలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఫార్మా సెక్టార్ స్కిల్స్‌పై నైపుణ్యతతో కూడిన శిక్షణ, వివిధ ఫార్మాకంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 2023, 2024, 2025లో బీఎస్సీ లేదా ఎంఎస్సీ (బీజెడ్‌సీ) కెమిస్ట్రీ, డిప్లొమా ఇన్ మెకానికల్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ ఇంజినీరింగ్, బీ–ఫార్మా లేదా డీ ఫార్మా లేదా ఎం ఫార్మా, బీఎస్సీ లేదా ఎంఎస్సీ (మైక్రోబయాలజీ), బీఈ లేదా బీటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 9న బయోడేటాతో మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ కార్యాలయం లేదా 81217 17846 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### మూడో విడతలో ముగ్గురు అభ్యర్థులు

- నేడు సర్టిఫికెట్ల పరిశీలన


**అనంతపురం ఎడ్యుకేషన్:** డీఎస్సీ–25లో మూడో విడతలో మరో ముగ్గురు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ముగ్గురి జాబితా శనివారం రాత్రి డీఈఓ కార్యాలయానికి అందింది. అభ్యర్థులకు మెసేజ్‌లు వెళ్లాయి. ఆదివారం ఉదయం డీఈఓ కార్యాలయంలో వారికి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఇదిలాఉండగా జిల్లాలో మొత్తం 807 వివిధ కేటగిరీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటిలో ఇప్పటిదాకా రెండు విడతల్లో 757 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందాయి. వారందరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. తాజాగా ముగ్గురి పేర్లు రావడంతో మొత్తం 760 మందికి కాల్‌లెటర్లు అందాయి. తక్కిన అభ్యర్థుల పరిస్థితిపై జిల్లా అధికారులకే స్పష్టత లేదు. ఇంతటితో ఆగిపోతుందా? ఇంకా ఎవరికైనా కాల్‌లెటర్లు వస్తాయా? అనేది అర్థంకాక అటు అధికారులు, ఇటు అభ్యర్థులు గందరగోళంలో ఉన్నారు.

### భూ సమస్య పరిష్కారానికి చర్యలు


సాక్షికి స్పందన

**అనంతపురం అర్బన్:** పేద దళితుడు జి.కుళ్లాయిస్వామి భూమి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన జి.కుళ్లాయిస్వామి భూమి సమస్య గురించి ఈనెల 1న ‘సాక్షి’లో కథనం ప్రచురితమయ్యింది. దీనిపై అనంతపురం రూరల్ తహసీల్దారు మోహన్‌కుమార్ క్షేత్రస్థాయికి వెళ్లి బాధితుడు కుళ్లాయిస్వామి సమక్షంలో విచారణ చేశారు. కుళ్లాయిస్వామికి చెందిన భూమిని సాగు చేస్తున్న వారితో మాట్లాడారు. రికార్డు ప్రకారం సర్వే నంబరు 334–17లోని ఎకరా భూమి కుళ్లాయిస్వామికి చెందుతుందని, వెంటనే దాన్ని అప్పగించాలని చెప్పారు. త్వరలో సర్వే చేయించి హద్దులు నిర్ణయించి భూమిని స్వాధీనం చేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారని బాధితుడు కుళ్లాయిస్వామి తెలిపాడు.

### మనల్ చౌహాన్ అద్భుత సెంచరీ



మనల్ చౌహాన్



మన్విత్ రెడ్డి

**అనంతపురం:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 ఇన్విటేషన్ టోర్నమెంట్ ఆర్డీటీ మైదానంలో కొనసాగుతోంది. శనివారం జరిగిన మ్యాచ్‌ల్లో ఆంధ్రా సెక్రెటరీ, మధ్యప్రదేశ్ జట్లు విజయం సాధించాయి.

- మధ్యప్రదేశ్, ఆంధ్రా ప్రెసిడెంట్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంపిక చేసుకుంది. మధ్యప్రదేశ్ జట్టు 48.2 ఓవర్లలో 283 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మనాల్ చౌహాన్ అద్భుత సెంచరీ (94 బంతుల్లో 10 ఫోర్లు, నాలుగు సిక్సర్ల సాయంతో 126 పరుగులు) సాధించి జట్టుకు భారీ స్కోరును అందించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు 31.3 ఓవర్లలో 154 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మధ్యప్రదేశ్ జట్టు 138 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.
- ఆంధ్రా సెక్రెటరీ, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత ఆంధ్రా సెక్రెటరీ బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 50 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 317 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆంధ్రా సెక్రెటరీ జట్టు నిర్దేశించింది. జి.మన్విత్‌రెడ్డి 82 పరుగులు (77 బంతుల్లో 4 ఫోర్లు, ఆరు సిక్సర్లు), రక్షణ్ 64 బంతుల్లో 57 పరుగులు (5 ఫోర్లు, మూడు సిక్సర్లు) సాధించి మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బరోడా జట్టు 40.5 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో ఆంధ్రా సెక్రెటరీ జట్టు 77 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది.

## పలువురికి డీడీఓలుగా పదోన్నతి

**అనంతపురం సిటీ:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఎంపీడీఓలుగా పని చేస్తున్న వారికి ఎట్టకేలకు డీడీఓలుగా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 46 మంది ఎంపీడీఓలను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(డీడీఓ)గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొమ్మిది మందికి చాన్స్ లభించింది. డీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు ఎంపీడీఓగా పని చేస్తున్న సి.రామకృష్ణను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ డీడీఓగా నియమించారు. ఉమ్మడి జిల్లాలో డీడీఓలుగా పదోన్నతి పొందిన వారి వివరాలు ఇలా..

| అధికారి పేరు | పని చేస్తున్న ప్రదేశం | బదిలీ స్థానం |
|---|---|---|
| షేక్ షకీలా బేగం | విడపనకల్లు | డీవీఓ, డ్వామా కర్నూలు |
| శివానందనాయక్ | డ్వామా ఏపీడీ, మడకశిర | డ్వామా ఏపీడీ, హిందూపురం |
| బి.వెంకటరామిరెడ్డి | గాండ్లపెంట | డ్వామా ఏపీడీ, ఆత్మకూరు, కర్నూలు జిల్లా |
| వి.సరస్వతి | హిందూపురం | డ్వామా ఏఓ, వైఎస్సార్ జిల్లా |
| ఎన్.రఘునాథగుప్తా | నల్లచెరువు | డ్వామా ఏఓ, నెల్లూరు జిల్లా |
| కె.ఆజాద్ | అమడగూరు | డ్వామా ఏపీడీ, కమలాపురం, వైఎస్సార్ జిల్లా |
| బి.రామకృష్ణ | గుమ్మఘట్ట | డ్వామా ఏఓ, అనంతపురం |
| పి.నరేంద్రకుమార్ | గోరంట్ల | డ్వామా ఏపీడీ, డోన్, నంద్యాల జిల్లా |
| బోయపాటి శకుంతల | అనంతపురం | డ్వామా ఏపీడీ, కదిరి |

### సెక్టోరియల్ పోస్టుకు దరఖాస్తు గడువు పొడిగింపు

**అనంతపురం ఎడ్యుకేషన్:** సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి ఐఈడీ కోఆర్డినేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 10 వరకు పొడిగించారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఐదేళ్ల అనుభవం ఉన్న టీచర్లు, ఎస్జీటీ కేడర్‌లో 8 ఏళ్ల అనుభవం కల్గిన టీచర్లు అర్హులని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. శనివారంతో గడువు ముగిసినా కలెక్టర్ ఆదేశాల మేరకు మరో నాలుగు రోజుల పాటు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**పామిడి:** జి.కొట్టాల గ్రామ కొండ చాటున అక్రమంగా నిల్వ ఉంచిన 45 బస్తాల (19 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని అధికారులు శనివారం పట్టుకున్నారు. బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఎస్‌డీటీ కంబక్క ఆధ్వర్యంలో సీజ్ చేసిన బియ్యాన్ని గుంతకల్లు స్టాక్ పాయింట్‌కు తరలించారు. ఇదిలా ఉండగా... దాదాపు 120 బస్తాల అక్రమ నిల్వకు గాను అధికారులు 45 బస్తాలనే చూపడంతో ఆంతర్యమేమిటో అని గ్రామస్తులు చర్చించుకోవడం కనిపించింది.

### రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

**గుత్తి:** జక్కల చెరువు రైల్వే స్టేషన్ సమీపంలో తమీమ్ ఎజాజ్ (43) అనే వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నట్లు జీఆర్‌పీ పోలీసులు చెప్పారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా తమీమ్ ఎజాజ్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### 9న సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

**అనంతపురం:** రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 9న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గాయత్రి, కార్యదర్శి సీఎస్ గంగమ్మ తెలిపారు. ఇందులో ఎంపికైన వారు విశాఖపట్నంలో ఈ నెల 26న జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొంటారు. 2011 జనవరి 1 తర్వాత జన్మించిన బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులు.

### పెన్నహోబిలం హుండీ ఆదాయం రూ.33 లక్షలు

**ఉరవకొండ రూరల్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను శనివారం ఈఓ తిరుమలరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. 110 రోజులకు గాను రూ.33.75 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే 12 గ్రాముల బంగారం, 697 గ్రాముల వెండి వచ్చినట్లు పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### నెలాఖరులోపు ఈ- క్రాప్ బుకింగ్ చేసుకోండి



సనపలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెలాఖరు లోపు తప్పని సరిగా ఈ -క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ విజయ్ జ్యోతికుమార్ శనివారం సూచించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితరటి పథకాలు అందవన్నారు. మండల వ్యాప్తంగా 22,485 హెక్టార్లు ఉండగా ప్రస్తుతం 3,700 హెక్టార్ల వరకూ ఈ క్రాప్ బుకింగ్ పూర్తయింద న్నారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంటను ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

### నేడు అభినందన సభ

అనంతపురం కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవా పురస్కారమందు కున్న ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షుడు జీవీ రామయ్య అభినందన సభ జరుగు తుంది. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మూడో రోడ్డులో ఘంటసాల భవన్‌లో జరిగే సంగీత విభావరి, రామయ్య అభినందన కార్యక్రమంలో కళాకారులు పాల్గొనాలని నిర్వా హకులు పాలసముద్రం నాగరాజు తెలిపారు.

### ట్రెజరీ హోమ్ ఆధునికీకరణకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ఖజానా శాఖ ఉద్యోగుల సంఘం కార్యాలయం ట్రెజరీ హోమ్ ఆధునికీ కరణ పనులకు శనివారం భూమిపూజ చేప ట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్య దర్శి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమానికి ఖజానాశాఖ డీడీ వెంకటేశ్వర్లు, ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్ర మోహన్, ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు దివాకర్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం కోశాధికారి పునీత్‌బాబు, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెన్నప్ప, ట్రెజరీ ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఫరూక్ అహ మ్మద్, కోశాధికారి అనంతయ్య, ఇతర నాయ కులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### తల్లి మందలించిందని యువకుడు అదృశ్యం



కుమ్మర వేణు (ఫైల్)

అనంతపురం: తల్లి మందలించిందనే మన స్తాపంతో ఓ యువకుడు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపో యిన ఘటన చోటు చేసుకుంది. నగరంలోని ఆరో రోడ్డుకు చెందిన కుమ్మర వేణు, సోదరుడు కుమ్మర లక్ష్మీనారా యణ బళ్లారి బైపాస్ ప్రాంతంలో వెల్డింగ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల నుంచి కుమ్మర వేణు వెల్డింగ్ షాపునకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. షాపులో పని ఎక్కువగా ఉంది.. వెళ్లమని తల్లి కే. ఎర్రమ్మ మందలించగా, శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తుం డగా, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తల్లి కే. ఎర్రమ్మ ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి నట్లు సీఐ కే. శాంతిలాల్ తెలిపారు.


### డీసీసీబీ బలోపేతానికి చర్యలు



డీసీసీబీ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆర్థికంగా బలోపేతం కావడానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సహ కార బ్యాంకు (ఆప్కాబ్) చైర్మన్ గన్ని వీరాం జనేయులు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆయన శనివారం స్థానిక డీసీసీబీలో చైర్మన్ ముంటిమ డుగు కేశవరెడ్డి, సీఈఓ కె.సురేఖారాణి ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. సహ కార బ్యాంకుల పురోభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తామని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,500 కోట్ల వ్యాపార లక్ష్యంగా కార్యక్రమాలు, బ్యాంకింగ్ వ్యవ హారాలు కొనసాగిస్తున్నామని చైర్మన్ తెలిపారు. రూ.650 కోట్ల డిపాజిట్లు సేకరణ లక్ష్యమ న్నారు. 1997కు ముందుకు సంబంధించి మొండి బకాయిల వసూళ్లకు ఓటీఎస్ సదు పాయం కల్పించాలన్నారు. పరస్పర సహకారం తో డీసీసీబీ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.

## నడుం విరుగుతోంది 'బాబోయ్'!



ఎన్టీఆర్ సర్కిల్‌లో..



నగరం నడిబొడ్డున ఉన్న సప్తగిరి సర్కిల్లో అధ్వానంగా రోడ్డు



లక్ష్మీనగర్‌లోని రోడ్డులో గుంతలు

నగరంలో రోడ్లపై ప్రయాణించాలంటే నరకం చూడాల్సి వస్తోంది. రోడ్లెక్కాలంటేనే వాహనదారులు వణుకుతున్నారు. అడుగుకో గుంత ఉన్న రోడ్లలో ప్రయాణంతో నడుం విరుగుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం రోడ్ల గురించి అసలు పట్టించుకోకపోవడం నగరవాసులకు శాపంగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





రంగస్వామి నగర్-రజక నగర్- సోమనాథ్‌నగర్ మార్గంలో అడుగడుగునా గుంతలు పడిన దృశ్యం



ఎప్పుడూ రద్దీగా ఉండే పీటీసీ వద్ద దుస్థితి

## అలరించిన పౌరాణిక నాటకాలు



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: నగరంలో రాష్ట్రస్థాయి నాటక పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. పోటీల్లో భాగంగా శనివారం కృష్ణకళామందిరంలో తెలంగాణకు చెందిన జోగులాంబ జిల్లాకు చెందిన 'సత్యా కృష్ణుల పరిణయ ఘట్టం', లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన 'బాలనాగమ్మ' నాటకం, పల్నాడు జిల్లా పెనుగొండ కళాకారుల శివభక్త కుంటి మల్లారెడ్డి చారిత్రాత్మక పద్యనాటకం, హైద రాబాద్‌కు చెందిన 'స్వామి అయ్యప్ప' నాటకాలు అలరించాయి. పోటీపడి నటిస్తూ ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహ కులు మైఖేల్‌బాబు, దివాకర్ మాట్లాడుతూ కళాకా రులను ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న నాటక పోటీలను ఆదరించాలని కోరారు.

- అధికారులుగా ఉంటూనే కళారంగం పట్ల ఆసక్తితో రంగస్థల కళాకారులతో కలిసి ఆదివారం డీఆర్వో మలోల, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి రంగస్థల వేదికను పంచుకోనున్నారు.

నేటి ఉదయం కళ్యాణదుర్గం వారి 'మాయల మరాఠి' నాటక ప్రదర్శన అనంతపురం వారి 'కార్యవర్ధి' సీను ప్రదర్శనలుంటాయి. సాయంత్రం డీఆర్వో మలోల శ్రీకృష్ణుడిగా, రంగస్వామి సుయో ధనుడిగా ప్రత్యేకంగా నటించే 'పడక సీను' ఉంటాయి. అలాగే కేపీహెచ్‌బీ కాలనీ వారి 'భక్తప్రహ్లాద' పౌరాణిక పద్య నాటకాలు జరుగు తాయని నిర్వాహకులు వెల్లడించారు.

## భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభ వ్రతం



హాజరైన భక్తజనం



పూజలందుకున్న అనంత పద్మనాభుడు

అనంతపురం కల్చరల్: అనంత పద్మనాభస్వామి వ్రతం శనివారం మొదటిరోడ్డు రాఘవేంద్రస్వామి ఆలయం, మూడోరోడ్డు సాయిబాబా మందిరం, తదితర చోట్ల నేత్రపర్వంగా సాగింది. నగరంలోని హెచ్చెల్సీ కెనాల్ సమీపంలోని కొల్హాపూర్ మహా లక్ష్మి అమ్మవారి ఆలయంలో వలీస్వామి ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ నేతృత్వంలో ఉదయం మహా గణపతిపూజ, స్వామివారి వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఇస్కాన్ ప్రతినిధి గౌరీ హరిదాస్ ప్రభు, అనంత పద్మనాభ వ్రత విశిష్టతను, భగవద్గీత ప్రాముఖ్యతను తెలియజే శారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు సంధ్యామూర్తి ఆలపించిన భక్తిగీతాలు సమ్మోహన పరిచాయి. ఈ సందర్భంగా కృష్ణనామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. మహా నైవేద్యం అనంతరం తీర్థప్రసాద వితరణ, నారాయణ సేవ జరిగాయి. యోగా గురువు కృష్ణవేణి, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధి కేవీఎస్ చలపతిరెడ్డి, నాగ రత్నమ్మ, సువర్ణ, లతారెడ్డి, కొండారెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

అనంతపురం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఏఐ ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి సాకే రమణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో బడుగు, బలహీన, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎంబీబీఎస్ చదవాలనే విద్యార్థులు అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, ప్రతిభావంతులైన పేద వారికి ఈ విధానం శాపంగా మారుతుందని వాపోయారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత వ్యక్త మవుతోందన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షలకు ఫీజు పెంపుదల చేశారని, దీంతో ప్రభుత్వ కళాశాల ల్లోనూ ఎంబీబీఎస్ కోర్సు పూర్తయ్యే సరికి కోటి రూపాయలు అవుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణ యాన్ని వెంటనే ఉపసంహరించుకుని ప్రభుత్వమే వైద్య కళాశాలల నిర్వహణ చేపట్టాలని కోరారు.

## సర్వజనాస్పత్రికి ఏమైంది!

- ఇష్టారాజ్యంగా మార్పులు
- రోగులకు నిత్యం చుక్కలు




సప్తగిరి సర్కిల్‌లో డాక్టర్ కౌసర్ బేగం ఆరా పాలీ క్లినిక్ పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అనంతపురం మెడికల్: జీజీహెచ్‌లో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఆస్పత్రిలో నెల రోజుల్లో చోటు చేసుకున్న పరిణామాలను చూస్తుంటే అసలు ఈ ఆస్పత్రికి ఏమైందని అనిపించక మానదు. ఆస్పత్రి అధి కారులు తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలతో పేద రోగులకు మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. వివరాలు.. గత నెల 12న సర్వజనాస్పత్రి క్యాజు వాలిటీ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న డాక్టర్ కౌసర్ బేగంను ఆ విధుల నుంచి తప్పించి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా నియమించడంపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. క్యాజువాలిటీలో వైద్యులు పూర్తి స్థాయిలో లేని సమయంలో అక్కడి 8 మందినీ సూపర్ స్పెషాలిటీకి పంపడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తాజాగా కౌసర్ బేగంను ఏకంగా డిప్యూటీ ఆర్ఎంఓగా నియమించినట్లు సమాచారం. మూడు రోజులుగా ఆమె డిప్యూటీ ఆర్ఎంఓ గదిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవంగా డిప్యూటీ ఆర్ఎంఓ పోస్టును ప్రభుత్వం ప్రకటించాల్సి ఉండడం గమనార్హం. ఇక.. చీఫ్ ఫార్మసీ సూపర్‌వైజర్ పోస్టును డాక్టర్ సౌజన్య కుమార్‌కు కేటాయించినట్లు తెల్సింది. ఆస్పత్రిలో 'అభా' రిజిస్ట్రేషన్‌ను సరిగా చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, ఆస్పత్రి నుంచి ఎప్పుడంటే అప్పుడు క్వార్టర్స్‌లోని తన ఇంటికి వెళ్లిపోతారనే ఆరోపణలు మూటగట్టుకున్న ఈయనకు ఫార్మసీ బాధ్యతలు కట్టబెట్టడం గమనార్హం.

**ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు..**

ప్రభుత్వాస్పత్రుల్లో విధులు నిర్వర్తించే వారు ఇష్టా నుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదు. ఇది నిబంధనలకు విరుద్ధం.కానీ కౌసర్ బేగం,ఆమె భర్త డాక్టర్ రోషన్ (మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్) జిల్లా అధికార యంత్రాంగం ఏం చేస్తుందిలే అన్న రీతిలో బరి తెగించడం గమనార్హం. తాము 'ఆరా' పేరిట పాలీ క్లీనిక్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల వీరు నగరంలో ఎక్కడ పడితే ఫ్లెక్సీలు వేసుకోవడమే ఇందుకు నిదర్శనం.

## రైతులు నష్టపోతున్నా పట్టదా?

- ప్రభుత్వాల తీరుపై వామపక్షాల ధ్వజం




నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: అమెరికా విధించిన 50 శాతం సుంకం ప్రభావం రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమపై తీవ్రంగా పడుతోందని, ఆక్వా రైతులు సంక్షోభంలో చిక్కుకుంటున్నప్పటికీ ప్రధాని మోదీని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిలదీయడం లేదని వామపక్షాల నాయకులు మండిపడ్డారు. అమెరికా విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు శనివారం స్థానిక క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపాయి. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు శ్రీరాములు, రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ, ఎస్‌యూసీఐ (సీ) జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, నల్లప్ప, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, రాఘవేంద్ర మాట్లాడారు. దేశ ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని అమెరికా దెబ్బతీస్తున్నా మోదీ సర్కార్ నోరుమెదపడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించకపోవడం దారుణమన్నారు. మన రాష్ట్రం నుంచి అమెరికాకు సముద్ర ఉత్పత్తుల్లో ఏటా దాదాపు 2 వేల కోట్ల డాలర్ల విలువైనవి ఎగుమతి అవుతున్నా యన్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాలపైనా ప్రభావం అధికంగా ఉందన్నారు. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు రమణ, కృష్ణుడు, పద్మావతి, కుళ్లాయిస్వామి, వెంకటనారా యణ, నాగరాజు, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

- భారత్‌పై అమెరికా ప్రభుత్వం విధించిన 50 శాతం సుంకాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేమన మాట్లాడారు. ర్యాలీలో పార్టీ గౌరవాధ్యక్షుడు వలి, నాయకులు పరశురాముడు, వంగపండు చంద్రప్ప, దావీదు, నల్లప్ప, ఓబయ్య, ప్రకాష్, సుజాతమ్మ, అరుణ, షరీఫ్ పాల్గొన్నారు.

### దిగుమతి సుంకాన్ని తగ్గించాలి

రాప్తాడు: అమెరికా భారత్‌పై విధించిన సుంకాన్ని తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరు తల మల్లికార్జున, సీపీఎం జిల్లా సెక్రెటేరియట్ మెంబర్ బాల రంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక బస్టాండు సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగు మతులపై సుంకాన్ని 50 శతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్ టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. ఇలా చేయడం వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతార న్నారు. మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి తలొ గ్గి కాటన్ దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకా లను రద్దు చేసి, పత్తి రైతులను సంక్షభంలోకి నెట్టి వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేం దుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏమాత్రం ప్రయ త్నించక పోవడం సరికాదన్నారు. సీపీఐ మం డల కార్యదర్శులు నరేష్, రవీంద్రా, బండారు శివ, చలపతి, శ్రీకాంత్, రాకెట్ల రాము, రెడ్డెప్ప, కుళ్లా యప్ప, ప్రసాద్, నారాయణ స్వామి, మహేశ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## గంగ ఒడికి గణనాథుడు



రథం ముందు కోలాటం ఆడుతున్న మహిళలు



చిందులు తొక్కుతున్న యువకులు, మహిళలు



వేలంలో లడ్డూను దక్కించుకున్న వెన్నపూస నాగేశ్వర్ రెడ్డి

రాప్తాడు: చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనం చేశారు. చిన్మయ నగర్‌లోని వీధుల్లో మేళతాళాలు, డప్పు వాయి ద్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరే గించారు. రథం ముందు పిల్లలు, వృద్ధులు, మహి ళలు, పెద్దలు తారతమ్యం లేకుండా చిందులు తొక్కారు. రంగులు చల్లుకుంటూ, టపాసులు పేల్చుతూ ముందుకు సాగారు. గొరవయ్యలు నృ త్యాలతో అలరించారు. మహిళలు ప్రత్యేక చీరలు ధరించి కోలటం చేయడం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత వెన్నపూస నాగేశ్వర్ రెడ్డి లడ్డూను రూ.53 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుల తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రెనాటి కొండా రెడ్డి, ఆలయ కమిటీ సెక్రటరీ కేతిరెడ్డి పరం ధామ రెడ్డి, జాయింట్ సెక్రటరి విజయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీటీని కాపాడుకుందాం

అనంతపురం టవర్‌క్లాక్: ప్రాణాలైనా అర్పించి ఆర్డీటీని కాపాడుకుందామని దళిత ప్రజా సంఘాల నాయకులు చెన్నకేశవులు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న మాంఛోఫెర్రర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి నిధులు రాకుండా నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. ఆర్డీటీ వల్ల దళిత, గిరిజనులు అభివృద్ధి చెందారన్నారు. కేంద్రం నిధులు రాని వ్వకపోతే ఎన్నో కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని, విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేపీ నారాయణ స్వామి, బాల పెద్దన్న, బాల,నరేష్ యనమల, మధు, మద్దలచెరువు మల్లీ, చిన్నపెద్దన్న, ఓబుల రాజు, నాగభూషణ, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

### పంపనూరు ఆలయం మూసివేత

ఆత్మకూరు: సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా మండలంలోని పంప నూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకే దర్శనం ఉంటుందని, తరువాత ఆలయం మూసివేస్తామని ఈఓ బాబు శనివారం తెలిపారు. సోమవారం ఆలయ శుద్ధి అనంతరం స్వామి దర్శనం ఉంటుందని, భక్తులు గమనించాలన్నారు.

### 10న సర్వసభ్య సమావేశం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉద్యోగుల బోధనేతర సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు కార్య దర్శి కే. సూర్యనారాయణ తెలిపారు. ఇప్పటి వరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధిం చి జమా ఖర్చుల గురించి చర్చించడంతో పాటు నూతన కమిటీ ఎన్నిక అంశంపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

### వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ



విజయశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల 17వ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. విజయవా డలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పెథాలజీ విభా గాధిపతిగా ఉన్న ఆమెను అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

### హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్ఓ మలోల

అనంతపురం మెడికల్: హెచ్‌ఐవీ పట్ల యువతను మేలుకొలిపేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన మారథాన్‌ను డీఆర్ఓ మలోల జెండా ఊపి ప్రారంభించారు. శనివారం మారథాన్ రెడ్ రన్ కార్యక్రమం నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి 5 కిలోమీటర్ల మేర సాగింది. డీఆర్ఓ మలోల మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదని పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి మాట్లాడుతూ పరుగు పందెంలో విజేతగా నిలిచిన వారికి రూ.10 వేలు, రూ.7 వేలు అందజేస్తామన్నారు. పురుషుల విభాగంలో చంద్ర శేఖర్ (ఎస్ఎస్‌బీఎన్), మహిళల విభాగంలో సాజిదా (ఎస్ఎస్‌బీఎన్) మొదటి స్థానాల్లో నిలి చారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమల్లో చంద్రబాబు విఫలం



చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రామగిరి: హామీలను అమలు చేయడంలో చంద్ర బాబు విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో చంద్రబాబు ష్యూరి టీ–మోసం గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిం చారు. ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలోల కోతలు విధిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలు, ప్రాం తం, పార్టీలను చూడకుండా అప్పటి ముఖ్యమం త్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పథకాలను సక్రమంగా అందజేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకాల అమలులో మోసం చేస్తోంద ని, చంద్రబాబు అంటే మోసం గ్యారంటీ అని ప్రజలకు అర్థమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీఎంఎన్ ఆస్పత్రి సీజ్

అనంతపురం మెడికల్: నగరంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న సీఎంఎన్ ఆస్పత్రిని శనివారం డీఎం హెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సీజ్ చేశారు. ఇటీవల ముదిగుబ్బ మండలానికి చెందిన ఓ యువతికి అబార్షన్ అయ్యింది. కాగా చివరి నిమిషంలో అక్కడి వైద్యులు చేతులెత్తేయడంతో యువతి కుటుంబీకులు ఆమెను కర్నూలుకు తరలి స్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై స్పందించిన డీఎంహెచ్ఓ శనివారం డెమో సిబ్బం దితో కలసి వెళ్లి సీఎంఎన్ ఆస్పత్రిని సీజ్ చేశారు. ఇదిలా ఉండగా యువతి మృతికి కారణమైన ఆస్పత్రి నిర్వాహకులు పత్తా లేకుండా పోయారు.